క్లుప్తంగా

ఎస్సై బాధ్యతల స్వీకరణ



నల్లబెల్లి: స్థానిక ఎస్సై గోవర్ధన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మహిళా పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్సై ప్రశాంత్ బాబు గీసుగొండకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సైకి ఏఎస్సై లక్ష్మారెడ్డి, హెడ్ కానిస్టేబుల్స్ రవీందర్, సాయిలు, కానిస్టేబుల్స్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక



లింగమూర్తి

దుగ్గొండి: మండలంలోని వెంకటాపురంలో పద్మశాలి సంఘం గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోరంటల లింగమూర్తి, గౌరవ అధ్యక్షుడిగా మాటేటి సదానందం, ఉపాధ్యక్షుడిగా మాటేటి యువరాజు, కార్యదర్శిగా ఆమంచ సోమేశ్వర్, డైరెక్టర్లుగా ఈగ రమేష్, అడ్డగట్ల ముత్యాలు, మాటేటి సంతోష్, రాజు, బంక సర్వేశం, కూచన సాంబయ్య, దూలం రమేష్ ఎన్నికయ్యారు.

వంట సామగ్రి పంపిణీ

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లిలో చెన బోయిన శంకరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఎస్ఆర్ఆర్ గ్రూప్ అధినేత, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పారుపాటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం 15 కిలోల వంట నూనె అందజేశారు. నిరుపేదల కుటుంబాలకు అండగా నిలుస్తున్న దాతలను గ్రామస్తులు అభినందించారు.

యూత్ అధ్యక్షుడిని కలిసిన మండల నాయకులు



సంగెం : వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన కేఆర్ దిలీప్‌ను మండల యూత్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం హనుమకొండలో కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్, ఉపాధ్యక్షుడు అచ్చ వర్ష, మండల యూత్ అధ్యక్షుడు గుగులోత్ రమేష్, నాయకులు శ్రీకర్, రామకృష్ణ, సన్నీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నర్సంపేట: పట్టణానికి చెందిన ఫర్టిలైజర్ వ్యాపారి బండారి రాంబాబు శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఆదివారం పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ రాంబాబు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, డీసీసీ అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్ రావు, నర్సంపేట మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, మాజీ మార్కెట్ చైర్మన్ యాకుబ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మధుకర్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రవికుమార్, అధికార ప్రతినిధి వీరప్రకాశ్ ఉన్నారు.

లో ఓల్టేజీతో ఎండనున్న పంటలు

నర్సంపేట: నియోజకవర్గంలో లో ఓల్టేజీ సమస్యతో పంటలు ఎండే ప్రమాదం ఉందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయానికి, గృహ అవసరాలకు లో ఓల్టేజీ సమస్య రాకుండా పెరుగుతున్న కరెంటు డిమాండ్‌కు అనుగుణంగా మూడు సబ్‌స్టేషన్లు 33/11కేవీలను మంజూరు చేయించడం జరిగిందన్నారు. సబ్‌స్టేషన్ల నిర్మాణానికి కావాల్సిన అనుమతులు తీసుకురాగా సంవత్సర కాలంగా నిర్మాణ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయి ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదన్నారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులతో మాట్లాడి నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు.

జీతాలు రాక.. పనులు మానలేక

- అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్న పారిశుద్ధ్య కార్మికులు
- జీతాల కోసం ఎదురు చూపులు
- పట్టించుకోని అధికారులు



సంగెంలో చెత్తను ఎత్తుతున్న పారిశుద్ధ్య కార్మికులు

సంగెం : వారు లేకుంటే గ్రామంలో పారిశుద్ధ్య లేదు. ఒక రోజు పనులు మానుకుంటే వీధులన్ని దుర్గంధమే. కానీ వారి బాగోగులు ఎవరికి పట్టడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిది నెలలుగా వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను పోషించుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని 33 గ్రామపంచాయతీల పరిధిలో 146 మంది మల్టీపర్పస్ వర్కర్లు (ఎంపీడబ్ల్యూ) వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. దసరా, దీపావళి పండుగలు పోయి సంక్రాంతి వస్తున్నా తమ జీవితాల్లో వేతనక్రాంతి ఎన్నడొస్తుందని ఆశతో ఎదురు చూస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులుగా ఎంపీడబ్ల్యూలు

జీపీల్లో కారోబార్, వాటర్‌మెన్, ఎలక్ట్రిషియన్, పారిశుద్ధ్య కార్మికులుగా నియమించబడిన వారందరిని 2019 జనవరిలో మల్టిపర్పస్ వర్కర్లుగా నియమించారు. జీఓ నంబర్ 51 ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదైన ఒక్కో కార్మికుడికి నెలకు రూ 9,500లు చెల్లిస్తున్నారు. వీరితో పాటుగా ఆయా జీపీల్లో తాత్కాలికంగా పనిచేసే కార్మికులకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 2021లో నియమించి పల్లెప్రకృతి వనాల్లో మొక్కల అలనాపాలనా చూసేందుకు రూ.5వేలు చెల్లించారు. గత ఏడాది ఏప్రిల్‌లో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యతను జీపీలకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నిధులు లేక ...

గ్రామపంచాయతీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం రెండేళ్ల నుంచి సరిగా నిధులు విడుదల కావడం లేదు. జీపీ ఎన్నికలు జరగక పాలకవర్గం లేక కేంద్రం నుంచి నెలవారీగా నిధులు రావడం లేదు. దీంతో పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులు నిధులు లేక కుంటుపడిపోతున్నాయి. ప్రభుత్వం అందించే నిధులు ఇతరత్రా పనులకు వినియోగిస్తూ పంచాయతీ కార్మికుల వేతనాలు అందించలేని పరిస్థితి నెలకొని ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జీతాలు అందకపోవడంతో కుటుంబపోషణ భారమై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేరే ఆర్థిక వనరులు లేక పిల్లల చదువులు, కుటుంబపోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తమకు రావాల్సిన బకాయిలు చెల్లించి ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

ప్రతి నెలా వేతనాలు ఇవ్వాలి



జీపీల్లో పనిచేస్తున్న కార్మికులకు ఇచ్చే జీతం తక్కువ. అది కూడా నెలనెలా ఇవ్వక పోవడంతో కుటుంబపోషణ భారమవుతోంది. అప్పులు చేయాల్సి వస్తున్నది. ప్రతినెలా జీతం ఇస్తేనే పూట గడుస్తది. మా కార్మికుల ఆకలి బాధలు తెలియజేసేందుకు ఆందోళనకు సిద్ధమవుతున్నాం.

– పోశాల రమేశ్, ఎంపీడబ్ల్యూ సంఘం మండల అధ్యక్షుడు

ఇబ్బందులు పడుతున్నాం



నెలవారీగా వేతనాలు రాక పోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. 8 నెలలుగా వేతనాల కోసం ఎదురు చూస్తున్నాం. జీతాలు వస్తాయని అంకితభావంతో పనులు చేస్తున్నాం. పండుగలు కూడా జరుపుకోలేకపోతున్నాం. అధికారులను అడిగితే వస్తాయని చెబుతున్నారు.

– మెట్టుపల్లి సమ్మయ్య, పారిశుద్ధ్య కార్మికుడు, సంగెం

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా నర్సంపేట డివిజన్ కార్యదర్శి రాజు



సమావేశంలో మాట్లాడుతున్న అడ్డూరి రాజు

నర్సంపేట: ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అర్హులైన నిరుపేదలకు మొదటి విడతలోనే ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలందరికీ ఇళ్లు కేటాయించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు నిజాయితీగా పని చేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అట్టహాసంగా డబుల్‌బెడ్రూం ఇళ్లను ప్రారంభించినప్పటికీ నిరుపేదలకు మొండిచేయి చూపిందని ఎద్దేవా చేశారు. అసంఘటిత రంగంలో మునిసిపల్, గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ, సింగరేణి, ఆశ, ఇతర రంగాల్లో పని చేస్తున్న కార్మికుల జీతాలు పెంచే విషయంలో ప్రభుత్వం ఈనెల 16న జరిగే అసెంబ్లీ సమావేశాల్లో జీతాల పెంపుపై ప్రకటన చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు కత్తుల కొమురయ్య, బానోత్ బుచ్చన్న, జవహర్ లాల్, కుసుమ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు



విద్యార్థులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న శ్రీనుబాబు

నర్సంపేట: పట్టణంలోని మోడల్ స్కూల్(బొందబడి) గ్రౌండ్‌లో ఆదివారం షూటోకాన్ జపాన్ కరాటే దూ ఇండియా హంబు సంస్థ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ క్యోషి రచ్చ శ్రీనుబాబు బ్లాక్‌బెల్ట్ 7వ డాన్ విద్యార్థులకు బెల్ట్ ఎగ్జామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 13 మంది విద్యార్థులకు బేసిక్స్, కటాస్, కుమితే విభాగాల్లో ప్రతిభ కనబర్చారు. పి.సంకీర్తన, పి.సాయిరాజ్, టి.విశ్వక్సేన్, వి.ధనుష్, బి.వర్ధన్‌లు ఎల్లో బెల్ట్ సాధించగా సామల చరణ్‌తేజ, శివప్రసాద్, ఓ సుదాంష్, పి.రిషిచంద్రలు ఆరెంజ్ బెల్ట్, అంకాల అభిజ్ఞ, సీహెచ్.సాయికిరణ్, కుసుమ మనీష్‌లు గ్రీన్‌బెల్ట్, పూజారి మణిదీప్ బ్రౌన్ బెల్ట్ సాధించారు. విజయ్‌కుమార్, కందికొండ శ్రీనాథ్, మాదాసి పవన్‌కళ్యాణ్, టెస్ట్ మూమ్‌మెంట్స్ పర్యవేక్షించారు. అనంతరం విద్యార్థులకు శ్రీనుబాబు డిప్లొమా బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మిత్రులంతా కలిసి ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. కష్ట సుఖాలు అడిగి తెలుసుకున్నారు. రూ. 5.50 లక్షలతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసుకున్నారు. కష్టాల్లో ఉన్న సహచరులను ఆదుకోవాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, కుసుమ జగదీష్, కస్తూరి రాజు, ముజీబ్, తొగరు రాజు, రమేష్, రాజేందర్, శోభ, మంజుల , రజిత పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలి

నల్లబెల్లి: కాంగ్రెస్ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తడుక వినయ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి అందించాలన్నారు. కేసీఆర్ పాలనలో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా 2 లక్షల ఇళ్లు మంజూరు చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం వాటి ఊసే తీయకుండా పేద మధ్యతరగతి ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పరిపాలన ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకుంటూ కాలయాపన చేయకుండా ప్రజల సంక్షేమంపై దృష్టి సారించాలని కోరారు.

యుగేంధర్‌శర్మకు జాతీయ అవార్డు



అవార్డును అందుకుంటున్న యుగేంధర్ శర్మ



అవార్డు అందుకుంటున్న రామ్మోహనాచార్యులు

వర్ధన్నపేట: వర్ధన్నపేటకు చెందిన ప్రముఖ పురోహితుడు, వాస్తు, జ్యోతిష్యుడు పోలోజు యుగేంధర్ శర్మ జాతీయ దైవ జ్యోతిష్య వాస్తు అవార్డు–24 అందుకున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని పాండిచ్చేరిలో నిర్వహించిన ఆధ్యాత్మిక వాస్తు జ్యోతిష్యుల మూడో అంతర్జాతీయ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన చర్చా వేదికలో ఆయన ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పురోహితుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె.కృష్ణమూర్తి చేతులమీదుగా యుగేంధర్‌శర్మ జాతీయస్థాయి దైవ జ్యోతిష్య వాస్తు అవార్డు–2024 అందుకున్నారు. అనంతరం యుగేంధర్‌శర్మ మాట్లాడుతూ జాతీయస్థాయిలో దైవ జ్యోతిష్య వాస్తు అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

రామ్మోహనాచార్యులుకు ఆస్ట్రాలజీ అవార్డు

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన బ్రహ్మశ్రీ ఆకోజు రామ్మోహనాచార్యులు వైదిక జ్యోతిష్య వాస్తు అస్ట్రాలజీ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ జ్యోతిష్య వాస్తు సదస్సు ఆధ్యాత్మిక మూడో ఇంటర్నేషనల్ జ్యోతిష్య అవార్డు సమావేశం తమిళనాడు రాష్ట్రంలోని పాండచ్చేరిలో నిర్వహించారు. రామ్మోహనా చారికి అవార్డును ప్రదానం చేశారు. అలాగే చింతనెక్కొండకు చెందిన మియాపురపు గురుబ్రహ్మాచార్యులుకు వైదిక్ జ్యోతిష్య వాస్తు అస్ట్రాలజీ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

చలి మంటలు వద్దు

రాయపర్తి : రోజురోజుకు పెరుగుతున్న చలి తీవ్రత తట్టుకునేందుకు చలి మంటలు వేయకుండా ఉన్ని దుస్తులు వాడడం మేలని పర్యావరణ ఉద్యమకారుడు రావుల భాస్కరరావు సూచించారు. ఆదివారం ఆయన చలిమంటలు కాగుతున్న వారికి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చలి మంటలు కాగడంతో అనేక అనారోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. చలిమంటల్లో పాత టైర్లు, పాలిథిన్ కవర్లు, పెట్ బాటిల్స్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగించడం వల్ల అనేక రకాల విషపూరిత వాయువులు విడుదలవుతాయన్నారు. దీంతో అనారోగ్య, చర్మ సంబంధిత, మానసిక సమస్యలు ఏర్పడతాయన్నారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు అర్చకుడు పరాశరం జయకృష్ణ ఆచార్యులు తెలిపారు. ధనుర్మాస ఉత్సవాలు నేటి నుంచి వచ్చే ఏడాది జనవరి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం, అధ్యయన ఉత్సవాలు, గోదా కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులుకావాలని పిలుపునిచ్చారు.

రేపు పాన్‌షాప్‌ల బంద్

హన్మకొండ అర్బన్: జిల్లాలోని పాన్‌షాప్‌లు మంగళవారం బంద్ నిర్వహించనున్నట్లు హనుమకొండ పాన్ మర్చంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగ కుమారస్వామి యాదవ్, ఎన్.సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని లష్కర్ బజార్‌లోని శ్రీలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10 గంటలకు సంఘం సర్వ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పాన్ ధరల సవరణ, నూతన కమిటీ ఎన్నిక, సభ్యత్వ నమోదు, తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సంఘం సభ్యులందరూ సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పూర్వ విద్యార్థుల చేయూత



జగదీష్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పర్వతగిరి: స్థానిక విశ్వభారతి ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయుడు జగదీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సందర్భంగా 2002–03 సంవత్సరంలో పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం రూ.57, 500లు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా నీలం రాజు, గఫార్, మద్ది రాజు, ముప్పిడి రాజు మాట్లాడుతూ వేల మంది విద్యార్థులకు పాఠాలు నేర్పి ఉన్నత స్థాయిలో చేర్పించిన గురువు జగదీష్ కుటుంబానికి దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేయాలని కోరారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న మహిళ మృతి



బానోత్ లక్ష్మి(ఫైల్)

నల్లబెల్లి: ద్విచక్రవాహనంపై నుంచి ప్రమాదవశాత్తు రోడుపై జారిపడిన ఓ మహిళ హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సంపేట మండలంలోని ముత్యాలమ్మ తండాకు చెందిన బానోత్ లక్ష్మి(57) ములుగు జిల్లా భాగ్యతండా శివారు గుర్తురు తండాలోని సమీప బంధువులు ఇంట్లో జరుపుకుంటున్న బొడ్రాయి పండుగకు తన కుమారుడు సురేష్ ద్విచక్రవాహనంపై ఈ నెల 12న ఉదయం బయలుదేరి వెళ్లింది. ఈ క్రమంలో నల్లబెల్లి మండలంలోని మూడుచెక్కలపల్లి శివారులోని ప్రమాదవశాత్తు ద్విచక్రవానంపై నుంచి జారి రోడ్డుపై పడింది. తీవ్ర గాయాలైన లక్ష్మిని నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉంది. వైద్యుల సూచనల మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ మృతి



బాలరాజు (ఫైల్)

గీసుకొండ: మండలంలోని నందనాయక్‌తండా గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ భూక్య బాలరాజు (28) అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అతడిని రెండు రోజుల క్రితం వరంగల్ నగరంలోని ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

గీసుకొండ: మండలంలోని దస్రుతండా వద్ద వరంగల్ –నర్సంపేట రహదారిపై నర్సంపేట వైపు వెళ్తున్న వ్యాన్ సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్ వైపు వెళ్తుండగా వెనక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వ్యాన్ పక్క నుంచి తాకుతూ వెళ్లింది. ఈ ప్రమాదంలో సంగెం మండలం కుంటపల్లికి చెందిన వ్యాన్‌డ్రైవర్ సతీష్‌కు స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు కారు ఢీ.. ఒకరికి గాయాలు



గీసుకొండ: మండలంలోని కోటగండి సమీపంలో వరంగల్–నర్సంపేట రహదారిలో ఎదురెదురుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు, కారు ఆదివారం ఢీకొన్నాయి. కారులో వరంగల్ నగరంలోని శివనగర్‌కు చెందిన కృష్ణమూర్తి, ఆయన భార్య కారులో వరంగల్ వైపు ఎదురుగా వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న కృష్ణమూర్తికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆయన భార్యకు స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. ప్రమాదంలో కారు ధ్వంసమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కేయూ లైబ్రరీ రిటైర్డ్ అసిస్టెంట్ మృతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ రిటైర్డ్ అసిస్టెంట్ పి.కొండల్‌రెడ్డి శనివారం సాయంత్రం మృతిచెందారు. హనుమకొండలోని కేయూ ఎంప్లాయిస్ కాలనీకి చెందిన కొండల్ రెడ్డి (66) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



అయ్యప్పస్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న గురుస్వామి

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం ఆలయ అర్చకులు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రోజు సరితమల్లేశ్వర్, నందిని, హర్షిని, సైరెడ్డి కృష్ణ, సావంత్, శిల్ప, సరోజన, ఈగ మౌనికప్రదీప్, అయాన్‌శ్రీనవ్‌లు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి 18 మెట్లపై జ్యోతులు వెలిగించి అన్నదానం చేపట్టారు. అనంతరం అయ్యప్పస్వామి జీవిత చరిత్రపై జరిగిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సైఫ సురేష్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్‌గుప్తా, చంద్రశేఖరం, ఈశ్వరయ్య, శంకరయ్య, వేణు, రాజు, లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, రవీందర్‌రెడ్డి, గురుస్వాములు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



పడిపూజలో పాల్గొన్న గురుస్వాములు, మాలధారులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో అప్పయ్యస్వాముల సామూహిక మహా పడిపూజ ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి ఆధ్వర్యంలో మొదట విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంబీమాత పూజ చేసి ధర్మశాస్త్ర అయ్యప్పకు పంచద్రవ్యాలు, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్లతో పాటు నదీ జలాలతో ఘనంగా అభిషేకించారు. అనంతరం 18 మెట్లపై పడి వెలిగించి శరణు వేడుకున్నారు. అనంతరం గురుస్వామి పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులందరికీ తీర్థ ప్రసాదాలు అందించారు. అందరి సహకారంతో నిర్వహించిన పడిపూజ ఉద్దేశించి ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని గురుస్వామి ఆశీర్వచనాలు అందించారు. సుమారు 600 మంది భక్తులు హాజరుకాగా స్వామి వారి తీర్థప్రసాదాలతో పాటు భోజనం స్వీకరించారు. గురుస్వాములు కిషన్, రాజు, సుమన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఐక్యతను దెబ్బతీయొద్దు

- ట్రెంగ జిల్లా అధ్యక్షుడు మరుపట్ల మల్లయ్య

ఐనవోలు : ఉద్యోగుల ఐక్యతను నూతన రెవెన్యూ సంఘాలు దెబ్బతీయొద్దని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ) జిల్లా అధ్యక్షుడు, మండల ఆర్ఐ మరుపట్ల మల్లయ్య కోరారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కొందరు రెవెన్యూలో నూతన సంఘాలు ఏర్పాటు చేసి సంఖ్యా బలం నిరూపించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వారికి భయపడాల్సిన అవసరం లేదని, సభ్యత్వాలు ఎవరు తీసుకోవద్దని కోరారు. గతంలో సమస్యల పరిష్కారానికి ట్రెంగ సంఘాన్ని స్థాపించినట్లు గుర్తుచేశారు. ఈ సంఘంలో మండల సర్వేయర్లు, ఎంపీఎస్ఓ, ఎస్‌ఏ, ఆర్ఐ, జేఏ, టైపిస్టులు, డ్రైవర్లు, రికార్డ్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు, వాచ్‌మెన్ ఉన్నారని తెలిపారు. నూతనంగా నాయబ్ తహసీల్దార్లతో కూడిన మరో సంఘాన్ని ఏర్పాటు చేయడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.